4)



# ఆదర్శాల అన్వేషణ

ఈ కథ రాయటమే అసలు అనవసరం. రాసినా పాత్రలకు పేర్లు పెట్టటం మరీ అనవసరం. అయినా ఒక తప్పిలాగూ చేస్తున్నాను గనుక రెండోదాని కోసం అంత భయపడనక్కర్లేదు. రోటిలో తలదూర్చి రోకటి పోటులకు వెరవటం ఎందుకు? సరే కానివ్వండి! జరగాల్సిందేదో జరిగే తీరుతుంది. ఎవడి కర్మకో నేను వెరవాల్సిన అవసరం?

సీతారామయ్య నామాటకాదని, నాలుగెకరాల పొలమూ అమ్ముకుని, ఆ వెనక బస్తీ చేరుకున్నాడు. శుభ్రమయిన గదొకటి తీసుకుని అందులో వుంటున్నాడు. బస్తీలో తెలిసో తెలియకో యిబ్బందిపడాల్సిన అవసరం తప్పిపోతూ వచ్చింది. చేతినిండా డబ్బుండటంవలన. వాడు తను వచ్చిన పని యేదో చూచుకొంటూ, గుట్టుగా బతుకుతే యీ కథే లేకపోవును. కాని అట్లా జరుగక పోవటంవల్లే!

తన కాగది అద్దెకు యిచ్చిన విచిత్రవ్యక్తి భూషణం పోకడలు గమనిస్తూ వచ్చాడు. ఆ భూషణం అనే ఆయనకు యిక్కడీ యిల్లేగాక మరో దిక్కుగా రెండు మేడలు వున్నాయని, ధనాశే గాక స్థల విస్తీర్ణాన్ని బట్టి వాటిని ఎవరెవరికో అద్దెలకిచ్చి యీ డాబాలో ముందుగదిని వీడికిచ్చి మిగతా నాలుగు గదుల్లోనూ భార్యా సమేతుడై కాపురం చేస్తోన్నాడనీ, వీరిద్దరికీ ఒక కొడుకున్నా అతనెప్పుడూ పట్నంనుంచి దిగిరాడనీ తెల్సుకోవటానికి సీతారామయ్యకేగాదు, దారిన బోయేవాడికెవరి కయినా ఎక్కుకాలం పట్టదు. ఎం చేతనంటే భూషణంగారి కీర్తి కాంత అట్లాంటిది!

మొట్ట మొదట్నించి వున్న జబ్బేగా మా సీతాయిగాడికీ, వీడు ఆ భూషణం అంటేనే మండి పడటం మొదలెట్టాడు. ఆయన వ్యతిరేకుల దగ్గర చేరి వాళ్ళ క్రోధాగ్నులకు ఆజ్యజని వూదాడు. తనెంత, తన తాహతెంత భూషణం ముందు? అదేమన్నా వూహించుకున్నాడా? నిజమంటే నిష్టూరం, ఈ మాటకు నామీదే విరుచుకు పడ్డారు మావూళ్ళో వాళ్ళంతా– ఆ సీతారామయ్య అంటే నేను కళ్ళలో నిప్పు లోసుకుంటానని.

మనిషికి ప్రవర్తనే ముఖ్యం అన్నాడు. ఆ భూషణం గారు భార్యను నానా హింసలూ పెడుతో, రోజుకో వారకాంతను తెచ్చుకొని, అనుభవిస్తున్నాడనీ

సుఖపడుతోన్నాడనీ వీడికి మహా కన్నెర్ర. భార్యకు దాంపత్యసుఖం లేకండా చేస్తోన్నాట్ట! అయినా వాళ్ళకే మంగమ్మ శపథం లాంటిదేముందో, వాళ్ళ పుట్టు పూర్వోత్తరాలు తనకేమయినా తెలిసేడ్చునా? ఎందుకొచ్చిన రగడ! అన్ని యిళ్ళుగలవాడిమీదా, అంత డబ్బు గలవాడిమీదా, విప్లవం లేవదీస్తానన్నాడు. అదేం చిత్రమో ఆ భూషణం మేగల్లో కాపురాలు చేస్తున్న వాళ్ళంతా వీడికి కావల్సినంత అండ యిచ్చారు. వీడికి దొరికినంత అండ, సహాయ సంపత్తీ ప్రకాశం గారి క్కూడా దొరకలేదు! చిత్రం! ఈ విషయం తనేం గొప్ప డిస్కవరీ చేసినట్టుగా నలుగుర్లోనూ వెళ్ళబెట్టాలా? అందరికీ తెలిసే వుండెను! కానీ ప్రచారమే చేశాడు. ఏమన్నా ఫలం దక్కిందా? “డబ్బున్నవాడు ఆయనేం చేసినా ఫరవాలేదు. నువ్వు డబ్బు లేనివాడవు గనక యేమీ అనగుడదు” అన్నారు అంతా. అవును, నాలుగెకరాలు అమ్మగా వచ్చిన డబ్బయినా, ఎన్నాళ్ళొస్తోంది ఆ వరస ఖర్చు చేస్తుంటే? ఇంత పరాభవమూ అయినా, వొదిలి పెట్టాడుగాదు చర్చలు, నలుగురూ దాన్ని ‘కార్యదీక్ష’ అన్నారు. వుంటారుగా గుడ్డి కుంకలు. ఎంతో గొప్ప రహస్యాలే దాగనప్పుడు యీ పేలుడు కాయనోటిమాటలు ఎక్కడ దాగ గలవు? ఆమాట భూషణం దగ్గరికీ వెళ్ళింది! ఆయన శాంత స్వభావం కలవాడు సహజంగా. ఎంతయినా, తన యింటోవుంటూ పోనీ, అద్దెకయితే మాత్రం? తన ముడ్డికే ఎసరు తెస్తోంటే చూస్తూ చూస్తూ ఎట్లా వూరుకోగలడు? మళ్ళీ నెల అద్దె వసూలు చేసుకునేటప్పుడు ఇద్దరికీ ఘర్షణ జరగనే జరిగింది, ఆయన్ను గురించి విషప్రచారం చేస్తే చేశాడు – ఆయన మొహానే అనేసెయ్యాలా ఆనాలుగు ముక్కలూ టొత్తిగా తాలిమి లేకుండా?

“నాయిష్టం. ఇది నాయిల్లు. నువ్వెవరు?” అన్నాడాయన. అంటాడు. అవును. అనడూ?

“ఎంత మీ ఇల్లయినా, సంఘానికి కట్టుబడుండాలి. మానవత్వం పూర్తిగా అణగారి పోకూడదు” అన్నాడు తనో గొప్ప వేదాంతిలాగ!

భూషణం తను వినియోగించ గలంత శాంతమూ వినియోగించి, “అబ్బాయీ, చిన్నవాడివి. నీకెందుకీ విషయాలు. జాగ్రత్తగా గదిలోవుంటో... నీ పని నువ్వుచూచుకో... మితిమీరకు...” అని మందలించాడు!

“నా కళ్ళముందే యింతటి దురాచారము జరుగుతూంటే ఎట్లా చూస్తో వూరుకోగలను?” అన్నాడు వీడు పెడకట్టెగా!

"పూరుకో లేకపోతే గది కాళీ చేసి వెళ్ళిపో" అన్నాడాయన. ఇంకా నయం పురెట్టు కోమన్నాడు గాదు!

గదికాళీ చేయటం విషయం వచ్చేసరికి, సీతారామయ్య గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టుగా అయింది! ఈ బస్తీలో... మరోగది దొరకదు. అయినా, ప్రయత్నిస్తే దొరకొచ్చు. దొరికినా అతని దురాచారం మాన్పించటం ఎట్లా సాధ్యం? కనక, గది వదిలే మాట వట్టిది! అంతదాకా రాకుండానే వ్యవహారం ఫైసలు చెయ్యాలి! గత్యంతరంలేక అట్లా కనిపించటానికి ఇష్టంలేకే, సీతారామయ్య మరి మాట్లాడ లేదు. రూపాయిల నోట్లు కోటు జేబులో నెట్టుకుంటూ, సీతారామయ్యవైపు 'పరాక్' అన్నట్లుగా చూచాడు భూషణం, వెళ్ళిపోతూనే! ఆ సంఘటన జరిగిన తర్వాత, భూషణం వీణ్ణోకంట కనిపెడుతోనే వున్నాడు! ఎందుకైనా మంచిదని.

వీథిలోవాడు వీథిలోనే పోతే సరిపోయేది. వీడు భూషణంభార్య అనుగ్రహం సంపాయించటానికి ప్రయత్నించాడు. ఆవిడ, తనకు మగజాతి అంటే యింతవరకూ కరుడుగట్టుకుని వున్న ద్వేషాన్ని కనబరుస్తో 'నీకు నాతో పనేమి'టని వీణ్ణి తిట్టేదాకా వొచ్చి ఇంట్లోకి వెళ్ళి పోయింది. ఈ విషయాన్ని గురించి మాట్లాడుతూ, సీతారామయ్య తనకు భృత్యాను భృత్యులుగా పనిచేస్తోన్న మిత్రుల్తో చిన్న వుపన్యాసం లాంటిది దంచాడు.

"మనదేశంలో స్త్రీలకు వున్న జ్ఞానం బహు తక్కువ. మనం సిగ్గు పడవలసినంత తక్కువ. ఎంత తెలివి తక్కువదయితే ఆ సుందరమ్మగారు నన్ను తిట్టేదాకా వొచ్చింది? ఇంకా ఆడవాళ్ళు పరాయి మగవాళ్ళతో మాట్లాడట్టానికి జంకుతోన్నారంటే మన దౌర్భాగ్య స్థితిని వర్ణించక్కర్లేకుండానే తెలుసుకోవచ్చును. మనలాంటి యువకులు 'దీక్షతో' సమాజ్యవస్థను మార్చటానికి శక్తి వంచన లేకుండా పని చెయ్యాలి. అప్పుడు గాని మన విద్యుక్త ధర్మాన్ని నెర వేర్చినవాళ్ళం గాము..." అట్లా అని!

భూషణం దగ్గిరా, సుందరమ్మగారి దగ్గరా తన కబుర్లు పని చేయనప్పుడు – గొప్ప తెలివిగా, భూషణం చేరదీసే వాళ్ళ దగ్గర చేరాడు. దేశమంతటా యిట్లాంటి అరాచకపు చేష్టలు పోతేనేగాని శ్రేయస్సు గలగదన్నాడు. డబ్బుకోసం 'అవినీతి' పన్లు చేయటం మంచిపని గాదన్నాడు. వాళ్ళ ప్రశ్నలకు సమాధనాలు తెలివిగా చెప్పి గొప్ప వాణ్ణని పించుకోవాలనిపోయి, దెబ్బ తిన్నాడు.

"మరి ఇది మావృత్తిగదా" అన్నదొక వనజ.

''మీ వృత్తి! అసలు వృత్తులెట్లా యేర్పడినై. మనం ఆపని చేస్తున్నప్పుడు గదా ఆ పని మనం వృత్తిగా చెప్పుకుంటున్నాం! అదంతా మన చేతుల్లో వుందిగాని'' అన్నాడు.

''మాకు డబ్బెట్లా వొస్తుంది, అంతా పొట్టకోసమే గదా?'' అన్న ప్రశ్నకు – ''అందరు ఆడవాళ్ళూ ఎట్లా బతుకుతున్నారు? వాళ్లలాగ మీరూ పెళ్ళీ పేరంటాలు, చేసుకొని, మొగుళ్ళమీద...''

వీడిమాట పూర్తి కాక ముందే వాళ్లంతా పకపకా నవ్వారు, సీతారామయ్య నిశ్చేష్టుడైనాడు. వాళ్ళలో వొక జాణ ''చాల్లేవయ్యా నేర్చావ్! మా దారిని మమ్మల్ని నడవనీక నీ అడ్డేమిటీ?'' అందిట! దెబ్బలదాకా రాకముందే జాగ్రత్త పడ్డాడు సీతారామయ్య.

మానవుడు పడగలన్ని పాట్లూ పడ్డాడు భూషణం గారిని సన్మార్గంలో పెట్టటాని కన్నట్లుగా! మంచికి పోతే చెడు ఎదురైనట్లు ప్రతి దానికీ ఏదోవో ఆటంకం యేర్పడి మెడకు తాడులాగా అయ్యేది.

కాగా, యీ ప్రయత్నాల్లో వీడు సభ్యతకోసమనీ, మర్యాద కోసమనీ ఇత్యాది పనులకనీ ఖర్చు చేసిన సొమ్ము, జమను మించిందయింది. డబ్బంతా వొదలగొట్టుకున్న తర్వాత మళ్ళీ ఊరు చేరుకున్నాడు. ఆ చివరి నెల అద్దెగట్టటానికీ యేమీ లేకపోగా,భూషణం దయదలచి వొదిలాడు.

మళ్ళీ వూరు చేరుకున్నాక నలుగురూ అడగటం మొదలెట్టారు. బస్తీలో యేం చేస్తుండే వాడివని, ఎంత ముల్లె దాచావనీ! వాళ్ళతో యేం చెప్పినా, నామాటవిననని యీ గడుగ్గాయి బస్తీలో వెలగబెట్టిన వుద్యోగం నాకు తెలుసు! అది మీ అందరికీ చెబుతున్నాను. వాడు మాత్రం బస్తీ వదిలి వచ్చిన కారణంగానీ, మళ్ళీ వెళ్ళనందుకు కారణం గానీ మరెవరికీ చెప్పలేదు.

ఇంతపనీ జరిగినా, నా మాట వినే తాహతు వాడు సంపాయించుకో లేక పోయాడు, భూషణంతో తనమీద చాడీలు చెప్పాననే అనుమానమో, యేమోగాని.

*

(*తెలుగు స్వతంత్ర*)